# ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ పాలన




- కొట్లాటలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్
- మాటలతో కాలం గడుపుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే
- ఇసుక దందా, గంజాయి దందాను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలం
- ప్రభుత్వ వైఫల్యాలపై విరుచుకు పడిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

16 నెలల కాంగ్రెస్ పాలన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ విమర్శించారు. మంచిర్యాలలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వ పనితీరుపై ఘాటు విమర్శలు చేశారు. అధికారం కోస ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని, రానున్న రోజుల్లో హస్తం పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వంపై దాడికి దిగుతుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం వీలు కాకపోడంతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఏడాదిన్నర కాలంలోని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కాంగ్రెస్ నేతలు ప్రతిపక్ష పార్టీపై విమర్శలకే పరిమితమవుతున్నారని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలుసన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం ఎటువంటి అభివృద్ధిని చేయకుండా కేవలం మాటలకే పరిమితమవుతోందన్నారు. రైతుల కోసం బీఆర్ఎస్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. రెండు లక్షల రుణ మాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. అర్థంలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు.

**చెన్నూర్ లో మైనింగ్, ఇసుక మాఫియా హవా**

చెన్నూర్ నియోజకవర్గంలో మైనింగ్, ఇసుక దందాలు శృతిమించాయని ఆరోపించారు. "వందలాది లారీల ఇసుక అక్రమంగా తరలిపోతుందని, అధికారులు నిష్క్రియగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మైనింగ్ కళాశాల ఏమయ్యిందని ప్రశ్నించారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని ఆరోపించారు. మంచిర్యాల జిల్లా గంజాయి దందాకు అడ్డాగా మారిందని, ఇంత జరుగుతున్నా. పోలీసు వ్యవస్థ ఏం చేస్తున్నదని ప్రశ్నించారు.

**చెన్నూర్ ఎమ్మెల్యే పై తీవ్ర విమర్శలు**

"చెన్నూర్ ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదు. అభివృద్ధి పనులు ఏవీ చేపట్టకుండా, మాటలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే, ప్రజలు సమయానుకూలంగా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**కాంగ్రెస్‌లో కొట్లాటలు... అవినీతి పరాకాష్ట**

జిల్లాలోని "ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం కోట్ల రూపాయల గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. అధికార యంత్రాంగం అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తున్నదని ఆరోపించారు.ప్రజాధనాన్ని దోచుకుంటున్నా, అవినీతి అడ్డుకోకుండా అధికారులు మౌనంగా ఉండటం శోచనీయమని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ మాత్రమే నిజమైన ప్రజాపక్షం**

"బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. మూడు ప్రాజెక్టులు ఎండిపోవడంతో రైతులు కొత్తగా బోర్లు వేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకోలేని ప్రభుత్వం ఏమి చేస్తుందంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తప్పకుండా అధికారంలోకి వస్తుందని బాల్క సుమన్ ఆశాభావం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ యువ నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, పార్టీ నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ వైఫల్యం స్పష్టం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలతో చెలగాటం ఆడుతోందని, పాలనాపరంగా పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. ఆదివారం క్యాతన్‌పల్లిలో తన నివాసంలో నియోజకవర్గ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న వరంగల్ ఎల్కాతుర్తి లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ కోసం ఏర్పాట్లు చర్చించారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త గ్రామ స్థాయిలో ప్రజల మధ్యకి వెళ్లాలని సూచించారు. పార్టీకు శాశ్వత విజయాన్ని అందించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ అధికారానికి విసిగి పోయారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం అనివార్యం అని సుమన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ డా. రాజరమేష్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మిట్టపల్లిలో పోలీసుల "పల్లె నిద్ర"

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: జైపూర్ ఎస్ఐ శ్రీధర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "పల్లె నిద్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జైపూర్ ఎస్ఐ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై, గ్రామస్తులకు పలు సూచనలు అందించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్ మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్, మద్యం, సోషల్ మీడియాకు బానిసలవుతున్నారని, భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఆన్లైన్ బెట్టింగ్‌ల తో అప్పుల్లో కూరుకుపోతూ ప్రాణాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువు లో ప్రావీణ్యం సాధించి, మంచి ఉద్యోగం పొందడం ద్వారా కుటుంబానికి గౌరవం వస్తుందన్నారు. వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ వహించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమ త్తంగా ఉండాలన్నారు. ప్రజల భద్రత కోసం రాత్రీపగలూ తేడా లేకుండా పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని తెలి పారు.గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నివారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిద్రిస్తున్న మహిళ మెడలో మంగళసూత్రం అపహరణ




- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఆదివారం తెల్లవారుఝామున జరిగిన బంగారు మంగళసూత్రం, మొబైల్ ఫోన్ దొంగతనాన్ని పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అపహరించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, హనుమాన్ నగర్‌లో నివసించే బుర్ర రాజేంద్రప్రసాద్ ఇంటి కిటికీ పక్కన ఉంచిన మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఆ తర్వాత అదే ప్రాంతంలో ఇరుముల్ల శరణ్య నివాసంలోకి కిటికీ మార్గంగా ప్రవేశించి, నిద్రిస్తున్న సమయంలో మెడలో ఉన్న మూడు తులాల మంగళసూత్రాన్ని లాక్కొని బైక్‌పై పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గోదావరిఖని కాకతీయ కాలనీకి చెందిన గుంజ ఇమాన్యుయేల్‌గా గుర్తించారు. అతడిని సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద పట్టుకుని, అతడి వద్ద నుండి మూడు తులాల బంగారు పుస్తెలతాడు, మొబైల్ ఫోన్, దొంగతనానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్టు విచారణలో వెల్లడైంది. ఈ కేసు ఛేదనలో సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్, ప్రవీణ్, పోలీసు సిబ్బంది జంగు, వెంకటేశ్, రాకేష్, మహేష్, శ్రీనివాస్, సతీష్‌లు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన బ్లూ కోల్ట్ పోలీసులు
- సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

**శెనార్తి మీడియా, జుక్కల్:**

కామారెడ్డి జిల్లా పిట్లం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘటనలో బ్లూ కోల్ట్స్ పోలీసులు ప్రాణాలను లెక్కచేయకుండా చొరవ చూపి ఓ మహిళను ఆత్మహత్య నుండి కాపాడారు. ఈ సాహసోపేత చర్యకు జిల్లా ఎస్పీ ప్రశంసలు అందజేశారు. పిట్లం గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో తీవ్ర మనస్తాపానికి గురై, గ్రామ శివాలయం సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశారు. ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు వెంటనే 100 నంబరుకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన బ్లూ కోర్టు సిబ్బందిలో కానిస్టేబుల్ జి. రవిచంద్ర, హోంగార్డు మారుతి ఘటన స్థలానికి చేరుకుని తమ ప్రాణాలకు తేడా లేకుండా చెరువులోకి దూకి మహిళను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందేలా చేశారు. సత్వరం స్పందించి ప్రాణాన్ని కాపాడిన సిబ్బందిని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల రక్షణ కోసం పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని, ఈ ఘటనలో వారు తమ విధి పట్ల నిబద్ధతను మరోసారి చాటిచెప్పారని ఆయన తెలిపారు.

# 22న ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు!

**హైదరాబాద్, ఏప్రిల్ 20:**

తెలంగాణలో ఇంటర్మీడి యట్ విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న టీజీ ఇంటర్ ఫలితాలను విడుదల చేసేందుకు ఇంట ర్మీడియట్ బోర్డ్ సిద్ధమైంది. ఏప్రిల్ 22వ తేదీన టీఎస్ ఇంటర్ రిజల్ట్స్ విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేతుల మీదుగా విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డ్ తెలిపింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 22వ తేదీన నాంపల్లి లోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క టీజీ ఇంటర్మీడి యట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య సహా అధికా రులు పాల్గొన నున్నారు. ఇంటర్ ఫలితా లు నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికా రిక వెబ్‌సైట్ https:// tgbie.cgg.gov.in/ వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఫలితాలు విడుదలైన తర్వార విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్ , పుట్టిన తేదీ ఎంటర్ చేసి ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



**శెనార్తి మీడియా, నిజామాబాద్ :**

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ శబ్బీర్ తెలిపారు. ఆదివారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవనంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శబ్బీర్ అలీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భాషా పండితుల మూడున్నర దశాబ్దాల కోరిక కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెరవేరిందన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు అందజేస్తోందని చెప్పారు.గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టినా, సీఎం రేవంత్ రెడ్డి కష్టపడి పరిపాలనను ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ ఇప్పటివరకు 60 వేల నియామకాలు చేశామని తెలిపారు.రాబోయే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యత ఉపాధ్యాయులదేనని, వారికి నాయకత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందుతుందన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వం కోసం సహకరించాలని, విద్యారంగంలో తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లేలా చేయాలని షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టం మార్పుపై బీఆర్ఎస్ వైఖరి స్పష్టత ఇవ్వాలి:

**శెనార్తి మీడియా, సిద్దిపేట:**

వక్ఫ్ చట్టంలో కేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన మార్పులపై బీఆర్ఎస్ తమ వైఖరిని బహిరంగంగా ప్రకటించాలంటూ సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముస్లింల పట్ల నిజమైన ప్రేమ ఉంటే బీఆర్ఎస్ నోరు మెదపాలని అన్నారు. ముస్లింల కోసం ఎప్పుడూ పోరాటం చేయని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, ఇప్పుడు లేనిపోని విమర్శలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ హయాంలోనే కల్పించారని, అది ఇప్పటికీ అమలులో ఉందన్నారు. ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్లు దండుకునే లక్ష్యంతో బీఆర్ఎస్ 12 శాతం రిజర్వేషన్ పేరుతో పదేళ్లు కాలయాపన చేసిందని విమర్శించారు. అప్పుడు ఫరూఖ్ హుస్సేన్‌కు ఇవన్నీ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీజేపీ తీసుకునే ప్రతి నిర్ణయానికి బీఆర్ఎస్ సహకరిస్తుందని, వీరిద్దరూ తోడు దొంగలులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్ని కలలో బహిరంగమైందన్నారు. రాబో యే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం చెబుతారని, మైనారిటీలు పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైపే ఉన్నారని తెలిపారు. వక్ఫ్ చట్టాన్ని మోడీ ప్రభుత్వం మార్చకుండా ఉండేందుకు గద్దె దిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## భవన నిర్మాణ కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

పట్టణంలోని పోచమ్మ బస్తీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పానుగంటి వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సంఘం తరపున ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, అధ్యక్షుడు జీలకర్ర రాయమల్లు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి, రూ.17,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ గొప్ప శంకర్, ట్రెజరర్ కత్తెర సతీష్, ఎర్రబెల్లి రాజేష్, సంగ రవి తదితరులు పాల్గొన్నారు

## రైతు మహోత్సవానికి రైతులు తరలి రావాలి

**శెనార్తి మీడియా, నిజామాబాద్:**

ఈ నెల 21 నుండి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రీ కాలేజ్ మైదానంలో జరగనున్న రైతు మహోత్సవానికి రైతులు తప్పక హాజరవ్వాలంటూ మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ పిలుపునిచ్చారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఈ మహోత్సవంలో వ్యవసాయానికి సంబంధించి పాడి పశువులు, వ్యవసాయ పనిముట్లు, చెరుకు ఉత్పత్తులు, వంగడాలు, ప్రైవేట్ సీడ్స్ కంపెనీలు, డ్రిప్, ఆర్టిఫిషియల్ అగ్రికల్చర్, మత్స్యశాఖ తదితర విభాగాల నుంచి దాదాపు 100 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారని, రైతులు సకాలంలో వచ్చి రైతు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు.